# బడుగులు సలసల



# బీసీలకు కాంగ్రెస్ వెన్నుపోటు

- అసమగ్ర కులగణనతో అన్యాయం
- తెలంగాణ ప్రజలకు రాహుల్ బహిరంగ క్షమాపణలు చెప్పాలి
- బీసీలకు 42% కోటా ఇచ్చే ఉద్దేశం కాంగ్రెస్‌కు లేదని తేలిపోయింది
- కామారెడ్డి డిక్లరేషన్ బుట్టదాఖలు చేయటమే లక్ష్యమా?
- బీసీ జనాభా తగ్గి.. అగ్రవర్ణాల జనాభా ఎలా పెరుగుతుంది?
- రాహుల్‌గాంధీకి రాసిన లేఖలో కేటీఆర్ ఆగ్రహం



హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): లక్షలాది మంది వివరాలు సేకరించకుండానే కులగణన సర్వేను తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు పూర్తిచేసిందని రాహుల్ గాంధీ లోక్‌సభలో పేర్కొనడం పార్లమెంటును తప్పుదోవ పట్టించడమేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. పదేండ్ల కిందట బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల సంఖ్య 1.85 కోట్లుగా తేలిందని, రాష్ట్ర జనాభాలో ఇది 51 శాతమని స్పష్టంచేశారు. మైనారిటీ బీసీలను కూడా కలిపితే ఆ సంఖ్య 61 శాతానికి చేరిందని గుర్తుచేశారు. పదేండ్ల తర్వాత కాంగ్రెస్ చేసిన కులగణనలో బీసీల జనాభా 1.64 కోట్లకు ఎలా తగ్గిందని, 46 శాతానికి ఎలా పడిపోయిందని ప్రశ్నించారు. ఈ మేరకు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి కేటీఆర్ బుధవారం బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ చూపుతున్న తప్పుడు లెక్కలను ఎవరూ నమ్మే పరిస్థితుల్లో లేరని తేల్చిచెప్పారు. చట్టసభలో రాహుల్ అబద్ధాలు చెప్పడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని పేర్కొన్నారు.

### బీసీల గొంతుకోసిన కాంగ్రెస్

అసెంబ్లీ సాక్షిగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే ఉద్దేశం కాంగ్రెస్‌కు లేదని తేలిపోయిందని కేటీఆర్ స్పష్టం చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తుంగలో తొక్కి, పార్టీ పరంగా సీట్లు ఇస్తామని చేతులెత్తేయడం మోసమేనని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ చేసిన ద్రోహాన్ని చూస్తూ ఊరుకోవడానికి తెలంగాణలోని బీసీ సమాజం సిద్ధంగా లేదని స్పష్టం చేశారు. ఎన్నికల్లో లబ్ధి పొందడమే ఏకైక లక్ష్యంగా అబద్ధాలు ప్రచారం చేసి డిక్లరేషన్లకు గోరీ కట్టిన పాపం కాంగ్రెస్‌ను వెంటాడటం ఖాయమని కేటీఆర్ తేల్చిచెప్పారు.

### బీసీలు తగ్గి.. అగ్రవర్ణాలు పెరగడమేంటి?

కులగణనలో దొర్లిన దారుణమైన తప్పులను సవరించాల్సిన బాధ్యతను మరిచి బంతిని కేంద్రం పరిధిలోకి నెట్టి చేతులు దులుపుకోవాలని చూస్తే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తెలంగాణలోని బీసీ సంఘాల నేతలు కులగణన నివేదికను చించివేసి నిరసన తెలిపాయని పేర్కొన్నారు. ఈ సర్వేతో బీసీలకు న్యాయం జరగకపోగా కాంగ్రెస్ సర్కారు తీవ్రమైన అన్యాయం చేసిందని దుయ్యబట్టారు. పదేండ్లలో అగ్రవర్ణాల జనాభా పెరిగి.. బీసీల జనాభా ఎలా తగ్గిందో చెప్పాలని లేఖలో రాహుల్‌ను నిలదీశారు.

### రాహుల్ భేషరతుగా క్షమాపణ చెప్పాలి

వెనుకబడిన వర్గాల భవిష్యత్తును నిర్దేశించే కీలకమైన కోటాను తప్పుల కుప్పగా తయారు చేయడం, కాంగ్రెస్ పార్టీకి బీసీల పట్ల ఉన్న నిలువెత్తు నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కులగణనలో చూపిన ఈ తప్పుడు లెక్కల వల్ల రానున్న రోజుల్లో ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని బీసీ బిడ్డలు ఆందోళన వ్యక్తం చేస్తుంటే.. వాస్తవాలు గ్రహించకుండా రాహుల్‌గాంధీ మాట్లాడటం దారుణమని పేర్కొన్నారు. తెలంగాణలో బీసీలకు తీవ్ర అన్యాయం చేసే ఈ ఫెయిల్యూర్ మాడల్‌ను దేశవ్యాప్తంగా అమలుచేయాలని రాహుల్ కోరడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. బీసీల జనాభాను తగ్గించి చారిత్రక తప్పిదం చేసిన కాంగ్రెస్ పార్టీని తెలంగాణలోని వెనుకబడిన వర్గాలు ఎప్పటికీ క్షమించవని కేటీఆర్ స్పష్టం చేశారు. గ్యారెంటీల పేరిట చేసిన గారడీని, డిక్లరేషన్ పేరిట చేసిన దగాను చూసిన తర్వాత వచ్చే స్థానిక ఎన్నికల్లో కాదు, ఏ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీని ప్రజలను నమ్మరని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని బీసీలకు రాహుల్‌గాంధీ భేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్‌లో బీసీలు సీఎం ఎందుకు కాలేదు?

**బీసీల పట్ల మీ పార్టీ చిత్తశుద్ధి ఇదేనా?**

**బీఆర్‌ఎస్‌లో మూడు ప్రొటోకాల్ పదవులు ఉంటే ఇద్దరు బీసీలే..**

**ఇది మా పార్టీ నిబద్ధత**


**టీపీసీసీ చీఫ్‌కు కేటీఆర్ చురక**

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): గడిచిన 50 ఏండ్లలో వీ హనుంతరావు, కే కేశవరావు, డీ శ్రీనివాస్, పొన్నాల లక్ష్మయ్య లాంటి తెలంగాణ బీసీ నాయకులు పీసీసీ అధ్యక్షులు అయ్యారు కానీ, ముఖ్యమంత్రి ఎందుకు కాలేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ప్రశ్నించారు. ఇది బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి? అని ఎద్దేవా చేశారు. బుధవారం ఈ మేరకు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కేటీఆర్ లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే రాజ్యాంగబద్ధమైన శాసనమండలి చైర్మన్, శాసనసభ స్పీకర్, రాజ్యసభ సభ్యులుగా బీసీ నేతలకు కేసీఆర్ అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు మూడు ప్రొటోకాల్ పదవులు ఉన్నాయని, ఆ పదవుల్లో కేసీఆర్, మధుసూదనాచారి, బండ ప్రకాశ్ కొనసాగుతున్నారని తెలిపారు. అయితే ఈ మూడు పదవుల్లో రెండింటిలో బీసీ నేతలే కొనసాగుతున్నారని చెప్పారు. ఇది బీసీల పట్ల బీఆర్‌ఎస్ పార్టీకి ఉన్న నిబద్ధత, చిత్తశుద్ధి అని కేటీఆర్ పేర్కొన్నారు. 'మాకు హితవు పలికే ముందు మీ దుస్థితిని ఆలోచించుకో.. పార్టీలు ఫిరాయించి, మీ పార్టీ అధినేత సోనియమ్మను బలిదేవతగా వ్యాఖ్యానించి, పదవుల కోసం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎన్ని పార్టీలైనా మార్చే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగా, జీవితాంతం పార్టీనే నమ్ముకొని, పార్టీని సర్వస్వంగా ఆరాధించే వాళ్లను విస్మరించడం, పదవులు ఇవ్వకుండా అవమానించడం మీ పార్టీకే చెల్లిందని మీరు గ్రహిస్తే మంచిది' అని కేటీఆర్ చురకలంటించారు.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ యూటర్న్

- కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు పాతర
- అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ సర్కార్ దగా
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): బీసీ రిజర్వేషన్ అమలుపై కాంగ్రెస్ సర్కార్ యూటర్న్ తీసుకున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుతో కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు పాతరేసినట్టు స్పష్టమైందని ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఆదరాబాదరగా అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిందని, ఏడాదిగా ఊరిస్తూ వచ్చినా బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు స్పష్టత లేదని తేలిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయలేమని సర్కార్ చేతులెత్తేసిందని తెలిపారు. బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ సర్కారు ఇప్పటివరకూ పూర్తిగా అబద్ధాలను ప్రచారం చేసిందని విమర్శించారు. అసెంబ్లీకి సమర్పించిన డాటా విషయంలో సర్కారుకే స్పష్టత లేకుండా పోయిందని తెలిపారు. స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు ఉద్దేశం అధికార పార్టీకి లేనేలేదని అందరికీ అర్థమైందని తెలిపారు. కేంద్రంపైకి నెపం నెట్టి తప్పించుకోవాలన్నది కాంగ్రెస్ పన్నాగమని ప్రజలకు తెలిసిపోయిందని ధ్వజమెత్తారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన ఎన్నికల హామీలు, చెప్పిన గ్యారెంటీలు, చేసిన డిక్లరేషన్లన్నీ బూటకమని విమర్శించారు. అబద్ధాలు ప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న రాహుల్‌గాంధీ తన పేరును ఎలక్షన్ గాంధీగా మార్చుకుంటే మంచిదని కేటీఆర్ ఎద్దేవా చేశారు.



# బడుగుల ధర్మాగ్రహం

## కులగణన నివేదికపై సర్వత్రా విమర్శ

**సొంతపార్టీ నేతల్లోనూ తీవ్ర అసంతృప్తి • '42%'పై తగ్గడంతో మరింత ఆజ్యం**

**తీరని ద్రోహం తలపెట్టిందని నిప్పులు • పోరాటానికి సై అంటున్న కుల సంఘాలు**

సమగ్ర కుటుంబ సర్వేలో బీసీ జనాభాయే ఎందుకు తగ్గింది? కులగణనలో కులాలవారీ లెక్కలేవి? అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై చర్చ ఎందుకు పెట్టలేదు? కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను ఎందుకు విస్మరిస్తున్నారు? చట్టబద్ధంగా బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామని, తీరా పార్టీ పరంగా ఇస్తామనుడేంది? ఇవి బీసీ వర్గాల నుంచి కాంగ్రెస్ సర్కార్‌కు ఎదురవుతున్న ప్రశ్నల బాణాలు. ఏడాదిగా ఎదురుచూశాం.. కాంగ్రెస్ నమ్మించి నయవంచనకు గురిచేసింది.. బీసీ హక్కుల సాధనకు పోరుబాట ఒక్కటే మార్గం. భవిష్యత్తు కార్యాచరణకు సిద్ధం.. అని బీసీ కుల సంఘాలు ప్రకటించాయి.

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): కులగణన నివేదికను తప్పులతడకగా రూపొందించారని, దురుద్దేశపూర్వకంగానే బీసీ జనాభాను తగ్గించి చూపారని కాంగ్రెస్ సర్కార్‌పై రాష్ట్రవ్యాప్తంగా బీసీలు రగిలిపోతున్నారు. సర్వే గణాంకాలపై అనేక అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను సైతం తుంగలో తొక్కుతూ, కేవలం పార్టీ పరంగానే రిజర్వేషన్లను కల్పిస్తామని చేసిన ప్రకటన కూడా వారిలో మరింత ఆజ్యంపోసింది. ఇది నయవంచనే అని బీసీ మేధావులు, కుల సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే పలు కుల సంఘాలు అంతర్గత సమావేశాలను నిర్వహించుకొని సర్వే గణాంకాలపై మేధోమథనం సాగించాయి. త్వరలోనే ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని బాహాటంగానే ప్రకటించాయి. బీసీ అనుబంధ సంఘాలన్నీ ఐక్యంగా పోరుబాటలో భాగమయ్యేందుకు ముందుకొస్తున్నాయి. సర్కార్ సర్వే నివేదికపై సొంత పార్టీ నేతల్లోనూ తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. దీంతో కాంగ్రెస్ సర్కార్ దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ, ఇంటింటి సర్వేపై రేవంత్ సర్కారు ఆది నుంచీ కాంగ్రెస్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నదని బీసీ, కులసంఘాల వారు మండిపడుతున్నారు. ఆదినుంచీ అనేక అభ్యంతరాలను వ్యక్తం చేసినా దిద్దుబాటు చర్యలు చేపట్టలేదని నిప్పులు చెరుగుతున్నారు.

### బీసీ, ఎస్సీల జనాభా ఎందుకు తగ్గింది?

అన్నివర్గాల జనాభా పెరిగి, బీసీ, ఎస్సీల జనాభా తగ్గడమేమిటని ఆయా వర్గాల వారు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. బీసీలకు చట్టబద్ధంగా కాకుండా, పార్టీపరంగా రిజర్వేషన్లను కల్పిస్తామని అసెంబ్లీ వేదికగా సీఎం ప్రకటించడంతో బీసీ కులసంఘాల నేతలు మరింత రగిలిపోతున్నారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధిలేదనేందుకు ఇదే నిదర్శమని వివరిస్తున్నారు. హైకోర్టు అక్షింతలు వేసేంతవరకూ కాంగ్రెస్ సర్కారు డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయలేదని గుర్తుచేస్తున్నారు. రేవంత్ సర్కారు తీరుతో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గే ప్రమాదం ఏర్పడిందని తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది. 42% ఏమో కానీ ఉన్న రిజర్వేషన్లే ఊడిపోయేలా ఉన్నాయనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

### సర్కార్ తీరుపై పోరుకు సమాయత్తం

కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బీసీ కుల సంఘాలు, ప్రజాసంఘాలు, మేధావులు రగిలిపోతున్నారు. ప్రభుత్వంపై ఐక్యంగా పోరాడేందుకు సిద్ధమవుతున్నారు. 42% రిజర్వేషన్ల పెంపుపై రేవంత్‌రెడ్డి సర్కార్ బీసీలను దగా చేస్తున్నదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య నిప్పులు చెరిగారు. చట్టబద్ధంగా కాకుండా పార్టీపరంగా ఇస్తామనడం మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయకుండా తప్పించుకోవాలని చూస్తే, బుద్ధిచెప్పక తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రకటనపై, సర్వే గణాంకాలపై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇప్పటికే ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ నేతల అఖిలపక్ష సమావేశంలో సర్వేపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. బీసీలకు కాంగ్రెస్ చేసిన ద్రోహాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీసేందుకు బీఆర్‌ఎస్, ఇతర రాజకీయ పార్టీలన్నీ సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే కుల సంఘాలతో గొంతుకలిపాయి. ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ ప్రశ్నించడమేగాక, సర్వే గణాంకాల తప్పొప్పులను ఎత్తిచూపుతున్నాయి. సర్కారు మోసాన్ని ఎండగడుతున్నాయి.



నల్లగొండలోని గడియారం సెంటర్‌లో కులగణన రిపోర్టు ప్రతులను దహనం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు





హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీసీ హక్కుల సాధన సమితి సభ్యులు

## కులగణన నివేదికపై భగ్గుమన్న బీసీలు

మహబూబాబాద్ రూరల్/వరంగల్/నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 5 : కులగణన తీరుపై బీసీ సంఘాల నేతలు భగ్గుమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మహబూబాబాద్, హనుమకొండ కలెక్టరేట్ల ఎదుట బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుగు కుమార్, రాష్ట్ర ఉప కార్యదర్శి నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన కులగణన నివేదిక సరిగా లేదంటూ బీసీ విద్యార్థి సంఘం, బీసీ సంక్షేమ సంఘం, విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో కులగణన నివేదిక ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఐతగోని జనార్దన్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ కులగణన తప్పుల తడకగా ఉన్నదని విమర్శించారు. 2014 నుంచి 2024 వరకు 21 లక్షల మంది బీసీలను తక్కువ చేసి చూపించారని మండిపడ్డారు.

# బడుగులకు బీఆర్‌ఎస్ అండ

- సర్కార్ కులగణన కుట్రపై గళమెత్తిన పార్టీ
- కామారెడ్డి డిక్లరేషన్ బుట్టదాఖలుపై కన్నెర్ర
- కాంగ్రెస్ తప్పుదిద్దుకోకపోతే ఉద్యమమేనని హెచ్చరిక



హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): బడుగులకు ఆది నుంచీ బీఆర్‌ఎస్ గొడుగుపడుతూనే ఉన్నది. వెనుకబడిన కులాలను వెక్కిరింతలకు గురిచేస్తే కాంగ్రెస్ సర్కార్‌ను వెంటాడుతామని హెచ్చరించింది. అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీ వర్గాలను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేసింది. కాంగ్రెస్ పార్టీకి బీసీల పట్ల చిత్తశుద్ధిలేదని రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు సర్కారు తీరుపై మండిపడుతున్నాయి. రేవంత్ సర్కార్ చేసిన ఘనకార్యాన్ని దేశానికే ఆదర్శమని పార్లమెంట్ వేదికగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తూర్పారబట్టారు. తెలంగాణ బీసీ వర్గాల గొంతుకగా బీఆర్‌ఎస్ నిలుస్తుందని కేటీఆర్ రాహుల్‌గాంధీకి ఆ లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ బీసీ వర్గాలకు రాహుల్‌గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ సర్కార్ ఏడాదికాలంగా ఊదరగొట్టి అసమగ్ర, అశాస్త్రీయ సర్వే చేసి బీసీలకు ద్రోహం చేసిందని లేఖలో మండిపడ్డారు. శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, శాసనసభలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, గంగుల కమలాకర్ సహా ఎమ్మెల్యేలు బీసీ కులగణన విషయంలో కాంగ్రెస్ చేసిన మోసాన్ని ఎండగట్టారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఒకవైపు మీడియా సమావేశాలు, మరోవైపు క్షేత్రస్థాయి నిరసనలు చేపట్టారు.

### సర్కార్‌పై బీసీ సంఘాల సైరన్

కాంగ్రెస్ సర్కార్ తీరును తెలంగాణవ్యాప్తంగా బీసీ సంఘాలు, బీసీ మేధావులు తీవ్రంగా నిరసిస్తున్నాయి. బీసీ కులగణన చేపడతామని, 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో నమ్మబలికిన కాంగ్రెస్ పార్టీ ఏడాది తర్వాత అసెంబ్లీ సాక్షిగా వంచిందని మండిపడుతున్నారు. 2014లో కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేయే శాస్త్రీయంగా ఉన్నదని, రేవంత్ సర్కార్ ఉద్దేశపూర్వకంగా తమ సంఖ్యను గణనీయంగా తగ్గించి తీరని అన్యాయం చేసిందని బీసీలు ఆగ్రహంతో ఉన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మొదటి నుంచి బీసీల పక్షపాతి అని, కేసీఆర్ సర్కార్ చేపట్టిన బీసీల అభ్యున్నతి కోసం అమలుచేసిన కార్యక్రమాలను బీసీ సంఘాల ప్రతినిధులు ఉదహరిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాన్ని ఆశించిన కాంగ్రెస్ సర్కార్ తమను ఏమార్చిందని, అవే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పక తప్పదని బీసీ సంఘాలు హెచ్చరించాయి.

# సమర్థించుకోలేక అపసోపాలు

- కులగణన సర్వే నివేదికపై బీసీలతో పాటు సొంత పార్టీలోనే అసమ్మతి
- దిక్కుతోచని స్థితిలో కాంగ్రెస్
- మీడియా సమావేశాలు పెట్టి మంత్రులు, పార్టీ నేతల హడావుడి
- పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అసెంబ్లీ హాల్‌లో ప్రజెంటేషన్
- సంతృప్తి చెందని బీసీ నేతలు

### ఉపకులాలవారీగా వివరాలు వెల్లడిస్తాం: ఉత్తమ్



సర్వేకు సంబంధించిన వ్యక్తిగత వివరాలను కాకుండా, కులాలు, ఉపకులాలు, జిల్లాలవారీగా సమస్త సమాచారాన్ని రెండ్రోజుల్లో పబ్లిక్‌డొమైన్‌లో పెడతామని సబ్‌కమిటీ చైర్మన్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో మీడియా ప్రతినిధులతో బుధవారం చిట్‌చాట్ చేశారు. కుల గణన సర్వేపై కొందరు అపోహలు వ్యక్తంచేస్తున్నారని అన్నారు. మొదట సమగ్ర కుటుంబ సర్వేతో పోల్చుకున్నారని, అది పబ్లిక్ డొమైన్‌లో లేని డాక్యుమెంట్ అని, ఎస్సీ వర్గీకరణ కూడా 2011ను ఆధారంగా చేసుకుని చేసిందేనని వివరించారు. సర్వేపై అపోహలను కులసంఘాల నేతలకు నివృత్తి చేస్తామన్నారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో ప్రత్యేక సమావేశంలో ప్రవేశపెట్టిన ఇంటింటి సర్వే నివేదికను సమర్థించుకునేందుకు కాంగ్రెస్ అపసోపాలు పడుతున్నది. సర్వే సజావుగా సాగలేదంటూ బీసీ సంఘాల నేతలు, వివిధ పార్టీల నాయకులు, చివరకు సొంతపార్టీ నేతల నుంచి సైతం విమర్శలు వస్తుండటంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. అసెంబ్లీ సమావేశంలోనూ వివరణ ఇవ్వలేక బోల్తాపడింది. గతంలో క్యాబినెట్ సబ్‌కమిటీ నివేదించిన సర్వే గణాంకాలను అసెంబ్లీ వేదికగా వెల్లడించారే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చెప్పిందేమీ లేదంటూ బీసీ సంఘాల నేతల నుంచి విమర్శలు పోటెత్తాయి. దీంతో ప్రభుత్వం ఉలిక్కిపడింది. ఒకవైపు మంత్రులు, మరోవైపు పలువురు కాంగ్రెస్ నేతలు వరుసగా సమావేశాలు నిర్వహిస్తూ హడావుడి చేస్తున్నారు. అసెంబ్లీ హాల్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేకంగా కులగణనపై ప్రజెంటేషన్ ఏర్పాటుచేశారు. మరోవైపు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సీతక్క, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియా సమావేశాలు నిర్వహించడం గమనార్హం. ఇప్పుడిదే చర్చనీయాంశంగా మారింది. ఆ సమావేశాల్లోనూ పూర్తి గణాంకాలను బయటపెట్టకుండా, చెప్పిన లెక్కలే పదేపదే చెప్తున్నారంటూ బీసీ నేతలు అసహనం వ్యక్తంచేస్తున్నారు.

### సొంత పార్టీలోనే తీవ్ర అసంతృప్తి

కులగణన సర్వే నివేదికపై స్వపక్షం నుంచే తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుండటంతో కాంగ్రెస్ కంగుతింటున్నది. సర్వే గణాంకాలపై సొంత పార్టీ నేతలే విమర్శలు గుప్పిస్తూ, వ్యతిరేకిస్తుండటంతో ఏం సమాధానం చెప్పాలో తెలియక కొట్టుమిట్టాడుతున్నది. కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అయితే ఏకంగా సర్వే నివేదికనే కాల్చిపారేశారు. ఇది అగ్రకుల సర్వే అంటూ అభివర్ణించారు. కొందరు ఎమ్మెల్యేలు, క్షేత్రస్థాయి కాంగ్రెస్ సీనియర్ నాయకులు సైతం ప్రభుత్వ తీరుపై పెదవి విరుస్తున్నారు. నివేదికపై అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు.

### ఎమ్మెల్యేలను సంతృప్తి పరచని ప్రజెంటేషన్

సర్వేపై సొంతపార్టీ నేతలు సైతం అసంతృప్తి వ్యక్తంచేస్తుండటంతో ప్రభుత్వం ఆలోచనలో పడింది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో రెండు గంటలపాటు బీసీ గణనపై ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసింది. సర్వే వివరాలను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ వివరించింది. ప్రజంటేషన్‌లోనూ కొత్తగా చెప్పింది ఏమీ లేదని పలువురు ఎమ్మెల్యేలు మరోసారి అసంతృప్తి వ్యక్తంచేయడం గమనార్హం. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన నివేదికను, సర్వే ఏ తీరుగా, ఎంతమందిని చేసింది? ఎందరు అధికారులు పాల్గొన్నది తదితర గణాంకాలనే మళ్లీ ఏకరువు పెట్టారు తప్ప కొత్తగా ఏమీలేదని పలువురు ఎమ్మెల్యేలు పెదవి విరిచారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మధ్యలోనే వెళ్లిపోయారు.

### పొరపాట్లుంటే సరిచేస్తాం: పొన్నం



కులగణనను ఫ్లాప్ చేయాలని కుట్ర చేస్తున్నారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కుల గణనలో పాల్గొననివారికి దానిపై మాట్లాడే నైతికత లేదని పేర్కొన్నారు. కులగణనలో ఏం పొరపాటు జరిగిందో చెప్పాలని, నిజంగానే పొరపాట్లుంటే బాధ్యతగా సరిచేస్తామని చెప్పారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారమే అన్ని హామీలు అమలుచేస్తామని తెలిపారు. కేంద్రంపై పోరాడేందుకు తమతో గొంతు కలపాలని కోరారు.

## పార్టీలో ఉన్నప్పుడు పార్టీ లైన్‌లోనే మాట్లాడాలి

**నవీన్ వ్యాఖ్యలను ఆయన విచక్షణకే వదిలేస్తున్నా: సీతక్క**




హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): పార్టీలో ఉన్న ప్రతిఒక్కరూ పార్టీ లైన్ ప్రకారమే మాట్లాడాలని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. బహిరంగ వేదికలపై పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. కులగణన ప్రతులను ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కాల్చేయడంపై ఆమె బుధవారం స్పందించారు. ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలను ఆయన విచక్షణకే వదిలేస్తున్నట్టు చెప్పారు. సర్వేపై అభ్యంతరాలు ఉంటే పార్టీ అంతర్గత సమావేశాల్లో మాట్లాడాలని హితవు పలికారు. గతంలో నిర్వహించిన అంతర్గత సమావేశాలకు ఆయన కూడా హాజరయ్యారని, అప్పుడు అభ్యంతరం చెప్పలేదని పేర్కొన్నారు. ఆయన అంశాన్ని పార్టీ చూసుకుంటుందని తెలిపారు.

# కులగణన అసమగ్రం

మొదటిపేజీ తరువాయి...

సూచించారు. హైదరాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కులగణన సర్వేలో 94,261 ఎన్యుమరేషన్ బ్లాక్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు 50 రోజులపాటు జరిగిన పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్రంలో కోటి 15 లక్షల కుటుంబాలు ఉండగా, కోటి 12 లక్షల కుటుంబాలను సర్వే చేశామని చెప్పారు. ఇందులో బీసీలు 56.66 శాతం ఉన్నారని, వారు ఆశిస్తున్న 42 శాతం రిజర్వేషన్ల కంటే ఇది 14.33 శాతం ఎక్కువ అని తెలిపారు. సర్వే రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తర్వాత బీసీల జనాభా పెరిగిందా? తగ్గిందా? అనే చర్చ జరుగుతున్నదని పేర్కొన్నారు. అయితే రిజర్వేషన్లు సాధించుకోవాలనే విషయంపై బీసీ నాయకులు, సంఘాలు దృష్టి సారించాలని కమిషన్ విజ్ఞప్తి చేస్తున్నదని అన్నారు. కులాల పేర్ల మార్పులపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ఆయా కులాల జీవన స్థితిగతులను పరిశీలించి ఈ



అంశంలో తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్ల అమలు అంశమై ఉద్యోగుల వివరాలు సేకరించాలని కమిషన్ నిర్ణయించినట్టు తెలిపారు. ప్రభుత్వ విభాగాలలో రోస్టర్ పాయింట్ రిజిస్టర్ నిర్వహణను పరిశీలించాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. వెనకబడిన తరగతుల కులాల సమగ్ర అధ్యయనం కోసం కుల సర్వే డాటాను ఇవ్వాలని ప్రణాళిక శాఖను కమిషన్ కోరనున్నదని తెలిపారు. ఈ సమావేశంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి పాల్గొన్నారు. ఇదిలాండగా, గతంలో సర్వే కొనసాగుతున్న సమయంలో డెడికేటెడ్ కమిషన్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం.